# పరివర్తనము

'శ్రీమతి కిళాంబి రుక్మిణీదేవి'

కామేశ్వరి కాపరానికివచ్చి రెండేడ్లయింది. కాని ఇంతవరకూ ఒక్క గంటయినా ముచ్చటగా భర్త మూర్తితో గడపలేదంటే అంతా ఆశ్చర్య పోతారు. ఏవేళప్పుడు ఆ మూడుముళ్ళూ కట్టాడో గాని పాపం అసలు కామేశ్వరిని చూస్తే నే మూర్తికి ఎక్కడలేనికోపం, విసుగూ పుట్టుకొస్తాయి బయట సేహితులలో తిరిగినంత సేపూ ఇతనంత జోలీమనిషి యింకెవ్వరైనా వుంటాడా అనిపిస్తుంది. ఎప్పుడూ నవ్వుతో వుంటాడు అందుకనే స్నేహితులందరికీ యితనంటే బహుయిష్టం. అదేమి ఖర్మమో ఆయింటి గడపలో ఏ శనివుందోగాని లోపల కాలు పెట్టగానే మూర్తి ముఖం ముడుచుకొనిపోయి ఎక్కడలేని చిరాకు, రుసరుసలూ పుట్టుకొస్తాయి కారణం గ్రహించలేక కామేశ్వరి తెల్లబోయేది. కాని పాపం ఏం చేస్తుంది. ఇంతకీ తన దురదృష్టమని ఏ రోజుకైనా తనకి మంచిరోజులు రాకపోతాయా అని తనకు తనే వోదార్చుకొనేది.

కామేశ్వరి పుట్టటం చాలా బీద కుటుంబంలో పుట్టింది. కాని పూర్వజన్మలో ఏదోకాస్త పెట్టి పుట్టటం వల్ల గొప్ప యింటిలోనేపడింది. స్త్రీకి కావలసిన భర్త ప్రేమ తప్ప తనకా యింటిలో అన్నీ వున్నాయి కోరిన నగలూ చీరలు. అత్త మామల ఆదరణ ఎన్నివున్నా కామేశ్వరికి తన భర్తయొక్క విముఖత్వము ముందర ఇవన్నీ బూడిదలో పోసిన పన్నీరువలే వుండేవి. ఎందుకొచ్చిన ఐశ్వర్యము? సంతోషములేని డబ్బు ఎందుకూ?

చేసుకొన్న భర్త ప్రేమతో లాలించే ముష్టి ఎత్తుకుని తిని చెట్టుక్రింద గడిపినా ఆ దంపతుల జీవితము ఎంత ఆనందమయంగా వుంటుంది! తనంటే తనభర్త కెందుకింత అసహ్యము? తను అంత అందవికారంగా వుంటుందా? కాదే! తన అత్తగారే తనని ఎప్పుడూ అంటుందే "మా కామేశ్వరి బంగారుబొమ్మ అమ్మా, మా వాడికి అనుభవించే యోగం లేదు కానీ" అని పోనీ తనేమైనా పల్లెటూరి మొద్దా? అదీకాదు కాస్తోకూస్తో నాలుగు ఇంగ్లీషుముక్కలు స్కూలు ఫైనల్‌దాకా చదువుకొని ఈ రోజుల్లోని ఫేషన్లన్నీ తెలిసినదే! కారణం అర్థంగాక కామేశ్వరి తహతహలాడేది.

రోజులు వీటన్నిటితో తమకేమీ సంబంధం లేనట్లు గడిచిపోతున్నాయి.

రాత్రి సుమారు తొమ్మిది గంటలు కావస్తోంది ఎదురుగా వున్న "ఆనంద భవనం" హోటలులో "ప్రేమ మయమీ జీవనమూ... ..." రికార్డు వేస్తున్నాడు ఎంత అనుభవంతో ప్రాసాదో ఆ పాటను ఆలపించింది, కామేశ్వరి మామూలుగా తన వంటయింటి పని అంతా ముగించుకొని ఒక చేత్తో వెండి మరచెంబుతో మంచినీళ్ళు, మరో చేత్తో తమలపాకుల పళ్ళెంతో గదిలో కాలు పెట్టింది మూర్తి పగలంతా అలసిపోయి వుండటంవల్ల అప్పుడే నిద్రాదేవికి వశుడై గురక పెట్టున్నాడు, కామేశ్వరి అటూ ఇటూ చాలాసేపు

చప్పుడు చేసింది. కాని మూర్తి కదల్లేదు. విస్పృహతో కిటికీ దగ్గరికి వెళ్ళి నిల్చుంది. ఎదురింటి తన స్నేహితురాలు "శశి" మధూలు సరదాగా డాబామీద వెన్నెల్లో కబుర్లు చెప్పుకొంటున్నారు. అది చూచేటప్పటికి కామేశ్వరి దుఃఖం పొంగి పొర్లి వచ్చింది తనేం పాపంచేసిందీ, తన భర్త ఇంత నిరాదరణ చూపటం ఎందుకూ? ఏడ్చి నిద్రపోయింది ఎప్పుడో....

కొన్ని రోజులు గడిచాయి. కామేశ్వరి అత్తగారు మామగారు యాత్రలకని బయలుదేరారు. పాపం కామేశ్వరికి అత్త మామలుకూడా వెళ్ళిపోతారనేటప్పటికి నెత్తిమీద పిడుగుపడ్డట్లయింది. పెద్దవాళ్ళుకూడా ఇంట్లో వుంటేనే తనభర్త అంత మాత్రం. వాళ్ళుకూడా వెళ్ళిపోతే ఇంక తన నెన్ని అవస్థలు పెట్టాడో అనుకున్నట్లుగానే మూర్తి మరి మితిమీరిపోయాడు, ఎప్పుడో కాని అసలు యింటికే వచ్చేవాడుకాదు. కనిపెట్టుకొని వుండి వుండి తిన్నరోజు తినీ తిననిరోజు తినకా అల్లాగే గడుపుతుందేది రోజులు,

అప్పటికి మూర్తి యింటికివచ్చి మూడురోజులయింది. కామేశ్వరి విచారంగా ఈజీ చైరులో పడుకొని ఆలోచిస్తోంది. వీధి తలుపు తట్టిన చప్పుడైంది మూర్తే వచ్చి వుంటాడని కామేశ్వరి గబగబా తలుపు తీసింది. ఎదురు గుండా ఎవరో ఒక అపరిచిత స్త్రీ వ్యక్తిని చూచేటప్పటికి తెల్లబోయింది. ఎవరీమె? తనెప్పుడూ చూడలేదే! అయినా ఇల్లు వెతుక్కొని వచ్చిన వారిని ఆదరించటం యింటి గృహిణి విధి అని ఆలోచించి.

"లోపలికి లండి రండి కామేశ్వరి"

"ఇది లోపలికి వచ్చి కూర్చునుటకు సమయముకాదు. నీ భర్త మూర్తి చాలా ప్రమాద స్థితిలో వున్నాడు. నేనూ అతనూ స్నేహితులము. నాపేరు "దమయంతి" మేమిద్దరమూ "ప్రేమ జీవనము" అనే పిక్చరులో యాక్టుచేస్తున్నాము. ఇవాళ మాటింగువుండటంవల్ల మేమిద్దరమూ కారులో స్టుడియోకి వెళ్తున్నాము. ప్రమాదవశాన్న మా కారు దారిలో పెద్ద మర్రిచెట్టుకి తగిలి తల్లక్రిందులైంది. నాకేం పరవాలేదుగాని మూర్తికి బలమైన గాయాలు తగిలాయి: ప్రస్తుతము 'జనరల్ హాస్పిటల్'లో వున్నాడు. నాతో గూడా వస్తే మీకు అతన్ని చూపించి నేను అవసరముగా స్టూడియోకి వెళ్లాలి' అని ఆ వచ్చిన వ్యక్తి గ్రుక్క త్రిప్పుకోకుండా చెప్పేటప్పటికి కామేశ్వరి నిలువునా క్రుంగిపోయింది. అయినా అధైర్యపడటానికి సమయమిదికాదని ఒక్క నిమిషంలో వంట గదిలోకి పరుగెత్తి తన యిష్టదైవమైన లక్ష్మీ విగ్రహానికి నమస్కరించి ఆమెతోగూడా బయలుదేరింది. ఇద్దరూ "జనరల్ హాస్పిటల్' చేరారు అక్కడ స్పెషల్ వార్డులో మూల్గుతో మూర్తి మంచముపై పడుక్కొని వున్నాడు నర్సులూ డాక్టర్లూ గాయాలకు కట్లు కడ్తున్నారు. కామేశ్వరికి కళ్ళకు నీళ్ళు గిర్రున తిరిగాయి. ఆ వచ్చిన వ్యక్తి తన డ్యూటీ ఐపోయినట్లు చరచరా నడిచి వెళ్ళిపోయింది. కామేశ్వరి పెద్ద డాక్టర్ల కాళ్ళమీదపడి తన కథంతా చెప్పుకుని తన భర్తని బ్రతికించి పతిభిక్ష పెట్టమని బ్రతిమాలింది. డాక్టరు మూర్తికి వచ్చిన భయమేమిలేదనీ, అతడు పూర్తిగా ఆరోగ్యవంతుడు కావటానికి కనీసం మూడునెలలు పడ్తుందనీ చెప్పాడు. ఎప్పటికైనా భర్త బ్రతికి బైటపడితే అంతే చాలునని తన శక్తివంచన లేకుండా సేవ చేయటం మొదలు పెట్టింది. అంత మంచంలోవుండికూడా మూర్తి "దమయంతీ, దమయంతీ" అని కలవరించేవాడు కామేశ్వరికి యిన్నాళ్ళకి తనభర్త తనని ఏవగించుకొన్న కారణం తెలిసింది. కట్టుకున్న భార్య కండ్లకు గంతలుకట్టి ఈవిధంగా సినిమాలో చేరి స్త్రీ లోలుడై చెడిపోయాడని గ్రహించింది.

కామేశ్వరి అదృష్టమువల్ల త్వరలోనే ఆరోగ్యవంతుడైనాడు. అమె ఆనందానికి అంతులేదు ఆ రోజు పెద్ద డక్టరు వచ్చి మూర్తిని డిస్‌చార్జి చేసాడు. మూర్తి కామేశ్వరి తనకు చేసిన సేవకి మిక్కిలి సంతోషించాడు. పరకాంతలు కులకాంతలకు సాటిరారని తెలుసుకొన్నాడు ఈ మూడు నెలలు తను మంచములో వున్నప్పుడు తను ప్రాణసమానంగా ప్రేమించిన దమయంతి ఒక్కసారైన వచ్చి చూడలేదు పైగా తను చూడాలని వుందని కబురుచేస్తే రావటానికి వీలు లేదనీ తను "రావు" అనే యింకో సెటునితో యాక్టుచేస్తున్నానని కబురుచేసింది. తను ఆమె కొరకు ఎంత డబ్బు వ్యయపరచాడు: కోరిన నగలు చేయించాడు. సీతాకోక చిలుకలాగా రకరకాల చీరెలు కొనిపెట్టాడు. అందరినీ కన్నతల్లిదండ్రులనూ, తననే దైవసమానముగా చూచుకొని ప్రేమించు అమాయకురాలైన భార్యనుకూడా వదలుకున్నానుగదా' దానికి ఆమె చూపించవలసిన ప్రేమయిదేనా? మూర్తి కామేశ్వరితోగూడా 'ఆసుపత్రి' నుంచి యింటికి వచ్చేశాడు.

అయినా మూర్తికి యింకా కొంచెము పూర్వం మోహం వదల్లేదు. ఎల్లాగైనా ఒక్కసారి దమయంతిని చూడాలని మనసు పీకుతుంది. కామేశ్వరికి తెలిస్తే ఏమనుకుంటుందో!

ఒకరోజు రాత్రి సుమారు 12 గం॥ సమయం వుంటుంది, కామేశ్వరి ఆనందంతో అమాయకంగా నిద్రపోతోంది మూర్తి మెల్లిగా చప్పుడుగాకుండా లేచాడు. దమయంతి యింటివైపు నడిచాడు, మెల్లగా మేడమెట్లెక్కాడు. బ్లూలైటు పర్వంగాటి చంద్రుడి లాగా వెలుగుతోంది లోపల ఒకటే నవ్వులు వినిపించాయి, మెల్లగా కిటికీ దగ్గరికి వెళ్ళి తొంగి చూశాడు తనకళ్లను తను నమ్మలేకపోయాడు. మరోమాటు చూశాడు, నిజమే తనతో ఎంతో ప్రేమగా నటించిన దమయంతి రావులో కేరింతాలు కొడ్తోంది మూర్తికి కళ్లు తెరుపుడు పడ్డాయి, సిగ్గుతో తలవంచేసుకున్నాడు, తన పూర్వ జీవితముమీద విరక్తి కలిగింది. ఇంటి వైపు నడిచాడు. మెల్లగ తలుపు గడియపెట్టి ఏమీ ఎరగనట్లు పడుకొన్ని నిద్రపోయాడు

మర్నాటినుంచీ మూర్తిలో విపరీతమైన మార్పు వచ్చింది యెప్పుడూ" కామేశ్వరీ, కామేశ్వరీ అంటూ తిరుగుతూ వచ్చాడు. ఈ విచిత్రమైన మార్పుకు కామేశ్వరి ఆశ్చర్యపోయింది.

ఇప్పుడు మూర్తికి కామేశ్వరితోడిదే లోకం వారి అన్యోన్యానురాగం చెప్పటానికి అలవికాదు. లోకానికి ఆదర్శదంపతులైనారు.

వారి ప్రేమ ఫలితంగా "ఆనందసాగర్" అనే కొడుకు పుట్టాడు.

ఆ రోజు ప్రభాత్ టాకీసులో "గృహలక్ష్మి" పిక్చర్ వుందని తెలిసి మూర్తి భార్యా పుత్రులతో టాక్సీలో "మాటినీ"కి బయలుదేరాడు. దారిలో 'దమయంతి' మేడ కనుపించింది. కామేశ్వరి వూరుకోకుండా" అదిగో నండీ మీ ప్రియురాలి ప్రేమ భవనము" అంది. 'ఛీ' అని మూర్తి ముఖం మరోవైపు త్రిప్పేశాడు.

కామేశ్వరి యిన్నాళ్ళకి కపటి ర్తతో కలిగిన మార్పుకి లోలోపల పొంగిపోయింది.... ...